క్లుప్తంగా

వీనులవిందుగా హరినామ సంకీర్తనలు



వైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద అల్లిపురం మేలుకొలుపు భక్త బృందం

అల్లిపురం: ధనుర్మాసం మూడవ శనివారం సందర్భంగా అల్లిపురం వీధులు హరినామ సంకీర్తనలతో పరవశించిపోయాయి. భక్త బృందాలు తెల్లవారు జామున 4 గంటల నుంచి వెంకటేశ్వరమెట్టలోని వేంకటేశ్వరస్వామి పాదాల వద్ద దీపారాధన చేసి అక్కడి నుంచి ప్రారంభమై సింహాలదేవిడి, మెయిన్‌రోడ్డు, బీఆర్ రెడ్డి జంక్షన్, నీలమ్మవేపచెట్టు రోడ్డు మీదుగా మాధవధార వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హరి నామ సంకీర్తనలు చేసుకుంటూ.. మేలుకొలుపులు పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరి సభ్యులు శరగడ నూకరాజు, జి.రామారావు, జి. మానస, వెంకటలక్ష్మి, బుద్ద లీలావతి, సునీత, గీత, సత్యవతి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌కు శుభాకాంక్షలు



మేయర్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతున్న సచివాలయ ఉద్యోగులు

అల్లిపురం: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖ శాఖ అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ అశోక్‌కుమార్ యాదవ్, ప్రతినిధులు శ్యామలరావు, పవన్‌కుమార్, జాన్ బాబు, వెంకటేష్ తదితరులు శనివారం నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబులకు పూలగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జీవీఎంసీ ఎంప్లాయీస్ గౌరవాధ్యక్షుడు ఆనందరావును కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ దరి మామిడి తోటలో మూడు రోజుల పాటు జరిగిన వైఎస్సార్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. 30 టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వాటిలో విజేతలుగా నిలిచిన జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బేతా దుర్గారావు, వెంకటరెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. కేజీహెచ్ పూర్వ ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ఈశ్వరరావు అవసరమైన పరీక్షలు నిర్వహించి, సూచనలు అందిస్తారు. రోగులు తమ వైద్య పరీక్షల రిపోర్టులను వెంట తీసుకురావాలని సూచించారు.

దక్షిణానికి ధనుర్మాస శోభ

- విశేష పూజలతో కళకళలాడుతున్న ఆలయాలు
- ముక్కోటి ఏకాదశికి ముమ్మరంగా ఏర్పాట్లు



పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం



బల్లిరూపంలో స్వామి



మూలవిరాట్టు పక్కనే బల్లిదేవుడి గుడి



ఎంబర్‌మన్నార్ దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: నగరంలోని దక్షిణ ప్రాంతమంతా ధనుర్మాస శోభ సంతరించుకుంది. నియోజకవర్గంలో శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయాలు ఉండటంతో భక్తి భావం వెల్లివిరిస్తోంది. దేవదాయ శాఖ కాస్త శ్రద్ధ కనబరిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా అల్లిపురం, బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కంచరవీధి, ఎంబర్‌మన్నార్ దేవాలయం, ఘోషాసుపత్రి సమీపంలో గల సీతారామచంద్రస్వామి దేవాలయం, పోర్టు వె వేంకటేశ్వరస్వామి, అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానాల్లో ధనుర్మాస పూజలు గత పదిహేను రోజులుగా కొనసాగుతున్నాయి. భోగి రోజు వరకు ఆయా దేవాలయాల్లో పాశుర పఠనం నిత్యం జరుగుతుండటం విశేషం.

బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం..
17వ శతాబ్దానికి చెందినదిగా చెప్పుకుంటున్న ఈ దేవస్థానంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి స్వయంభుగా బల్లిరూపంలో ఇక్కడ వెలిసారని ఆలయ చరిత్ర చెబుతోంది. డచ్ వారు వ్యాపార నిమిత్తం సముద్రమార్గం గుండా వచ్చి ఇక్కడ సేద తీరిన సమయంలో వారి స్వప్నంలో కలియుగ వేంకటేశ్వరుడు కనిపించి తాను ఇక్కడ బల్లిరూపంలో వెలిసానని చెప్పారట. దాంతో స్వామి రూపం వారికి కనిపించటం.. తరువాత కాలంలో ఇక్కడ దేవాలయ నిర్మాణం చేపట్టటంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ దేవాలయం స్వతహాగా ఉత్తరద్వారం కావటంతో విశిష్టత సంతరించుకుంది. భోగి రోజు గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఎంబర్‌మన్నార్ దేవస్థానం..
15వ శతాబ్దానికి చెందిన ఎంబర్‌మన్నార్ దేవాలయం పాతనగరంలోని కంచరవీధిలో వెలసింది. ఈ దేవస్థానానికి వైశాఖ రాజుల పాలనలో నిత్య ధూపదీప నైవేద్యాలు ఉండేవి. వారి తదనంతరం దేవాలయానికి ఆదరణ తగ్గింది. కొంత కాలం తరువాత భక్తులు చొరవ చూపి దేవాలయంలో పూజలు చేయటంతో తిరిగి ప్రాముఖ్యత సంతరించుకుంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పుడు స్వామికి ప్రత్యేక పూజలు, నిత్య ధూప దీప నైవేద్యాలతో విలసిల్లుతోంది. ధనుర్మాస ఉత్సవాలు నెల రోజుల పాటు జరుపుతున్నారు. వైశాఖ మాసంలో స్వామి వార్షిక కల్యాణం ఉంటుంది.

కోదండరామస్వామి దేవస్థానం..
ఘోసాసుపత్రి దరి కోదండ రామస్వామి దేవస్థానం 800 ఏళ్ల నాటిదిగా ఆలయ చరిత్ర చెబుతోంది. ఈ దేవస్థానంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలు సముద్రంలో లభించినట్లు స్థానికుల కథనం. వాటిని ఇక్కడ ఏర్పాటు చేసి దేవాలయాన్ని అభివృద్ధి చేసారని ప్రతీతి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజున స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం..
ఈ దేవస్థానానికి వందేళ్ల చరిత్ర ఉంది. పోర్టు ట్రస్ట్ ఈ దేవాలయ నిర్మాణంలోను, అభివృద్ధిలోను భాగస్వామి కావటం విశేషం. ఈ దేవాలయంలో నిత్యం ధూప దీప నైవేద్యాలు జరుగుతున్నాయి. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో స్వామి వార్షిక కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పోర్టు కార్గో అభివృద్ధి చెందటంతో పోర్టు వెంకన్న దేవాలయానికి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యాలు కరవయ్యాయి. దీంతో భక్తుల ఆదరణ తగ్గింది. అయినప్పటికీ పోర్టు వెంకన్న దేవాలయం అంటే తెలియని వారు ఉండరు. ఈ దేవస్థానంలో కూడా ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా చేపడుతున్నారు.

అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానం..
కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం దత్తత దేవాలయం అయిన జగదాంబ దరి అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానం దశాబ్ద కాలంగా బాగా వెలుగులోకి వచ్చింది. గత రెండు సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడంతో ఈ ఏడాది ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

జనవరి 2న వైకుంఠ ఏకాదశికి సిద్ధం..
జనవరి 2వ తేదీన వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆయా దేవాలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెల్లవారు జాము 3 గంటల నుంచి దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్ల ఏర్పాట్లుతో ఆలయాలను అందంగా అలంకరించారు.

ఆత్మీయ వీడ్కోలు



కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి శనివారం రిటైరైన డాక్టర్ పి.మైథిలీని, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైరైన డాక్టర్ వైజీ సుందరరాజును కేజీహెచ్ నర్సులు శాలువ కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.
–మహారాణిపేట



నేడు శ్రీశయన కులస్థుల నూతన సంవత్సర వేడుకలు

డాబాగార్డెన్స్: శ్రీశయన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 4 గంటలకు సంఘ కార్యాలయంలో (తోట వాసుదేవరావు గృహం వద్ద) నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికాపై చర్చించనున్నట్టు చెప్పారు. శ్రీశయన కులస్థులు, సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొనాలని వాసుదేవరావు కోరారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో సచివాలయాలను జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రెవెన్యూ, యూజర్ చార్జీల వసూలు వేగవంతం చేసి జోన్‌ను ముందు వరుసలోకి తీసుకువచ్చే బాధ్యత సెక్రటరీలదే అన్నారు. శానిటరీ సెక్రటరీలందరూ క్లాప్ వాహనాల రాకపోకలు, రూట్‌మ్యాప్‌లు రికార్డు చేసుకోవాలన్నారు. రెవెన్యూ వసూలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే సెక్రటరీలు అందరు అన్ని శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. అందరం కలసి పని చేస్తేనే జోన్‌ను మరింత ముందుకు తీసుకు వెళ్లవనని జెడ్సీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



వెలంపేట సచివాలయంలో యూజర్ చార్జీల వసూలుపై ఆరా తీస్తున్న జెడ్సీ చక్రవర్తి

అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలవాలి

మహారాణిపేట : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయం సాధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ఐక్యంగా కృషి చేస్తామని జిల్లా ముస్లిం నాయకులు, పలువురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఇతర ముఖ్య నాయకులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం వుడా మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్ఏ రెహ్మాన్ అధ్యక్షతన ముస్లిం, మైనార్టీ నాయకుల సమావేశం ఒక హోటల్లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశాఖలో ఎక్కడైతే ముస్లిం సోదరులు ఉంటారో, ఆ ఏరియాల్లో ఓట్లు చీలకుండా ఇప్పటి నుంచే ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ ఆంధ్రా మైనార్టీ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూఖీ, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ గౌస్, కో ఆప్షన్ కార్పొరేటర్ ఎండీ షరీఫ్, జీవీఎంసీ విప్ మహ్మద్ ఇమ్రాన్, కార్పొరేటర్లు బర్కాత్ ఆలీ, మహ్మద్ సాధిక్, ఏపీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షబ్నమ్ అఫ్రోజ్ షేక్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మహ్మద్ సబిరా బేగం, షేక్ నాగు నిషా బేగం (మున్ని), ఆలియా నూరాణి, షేక్ బాబ్జీ, ఖాదర్ సకీనా బేగం (ఏపీ హిస్టరీ అకాడమీ), టెలికామ్ సలహా సంఘం సభ్యుడు ఎండీ మఘబూల్ పాల్గొన్నారు.



డాక్టర్ ఎస్ఏ రెహ్మాన్ అధ్యక్షతన సమావేశమైన ముస్లిం, మైనార్టీ నాయకులు

సాలిపేటలో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన సామగ్రి



అగ్నికి ఆహుతైన ఇంట్లోని సామగ్రి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు సాలిపేటలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సయ్యద్ గౌస్ ఇల్లు.. ఇంట్లోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరి మంటలు అదుపులోకి తెచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. సాలిపేటలో నివాసముంటున్న సయ్యద్ గౌస్, కుటుంబ సభ్యులు వైద్యం కోసం శనివారం మధ్యాహ్నం బయటికి వెళ్లారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం...ఆ సమయంలో రిఫ్రిజిరేటర్ ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇల్లంతా పొగ కమ్మేసింది. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఇంటి నుంచి పెద్ద ఎత్తున మంటలు వస్తుండడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తేవడంతో ఆ మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా ఆపగలిగారు.

ఆ ఇంట విషాదం..
2022 సంవత్సరం వెళ్లిపోతూ ఆ ఇంట విషాదాన్ని నింపింది. సర్వం బూడిదవ్వడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. వైద్యం కోసం బయటికి వెళ్లిన తరుణంలో ఇల్లు కాలి బూడిదవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త వత్సరం.. కొంగొత్త ఆశలు



కిటకిటలాడుతున్న జగదాంబ జంక్షన్ (నూడిల్స్ వీధి)



న్యూ ఇయర్ వేడుకలకు కేకులు సిద్ధం

డాబాగార్డెన్స్: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని యువతీ యువకులు కేరింతలు కొట్టారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ..నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఎంజాయ్ చేశారు. నియోజకవర్గ పరిధి గల్లీ గల్లీలో హ్యాపీ న్యూ ఇయర్ సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముందు పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ..హ్యాపీ న్యూ ఇయర్–2023కి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటల నుంచే న్యూయర్ సందడి నెలకొంది. రోడ్లపై యువకులు కేరింతలు కొడుతూ బైక్‌లు డ్రైవ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. సరిగ్గా 12 గంటలకు న్యూఇయర్‌ను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ రోడ్లపై పరుగులు తీశారు.

కేక్‌లకు గిరాకీ..
న్యూ ఇయర్ సందర్భంగా బేకరీ దుకాణదారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ కేక్‌లను విరివిగా విక్రయించారు. కేజీ కేక్‌ను రూ.400 నుంచి రూ.500, ఐస్‌కేక్‌ను రూ.600 నుంచి రూ.700.. ఇలా విక్రయించారు. కేక్‌లు కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు.

మద్యం దుకాణాల వద్ద..
మద్యం దుకాణాల వద్ద మందుబాబుల హడావుడి కనిపించింది. కళాసీలు, కూలి పనులు చేసుకునే వారు.. దుకాణాల్లో పని చేసేవారు పలు మద్యం దుకాణాల వద్ద క్యూలో నిల్చుంటూ న్యూ ఇయర్‌ను ఎంజాయి చేశారు.

ఉత్సాహంగా న్యూఇయర్ వేడుకలు
అల్లిపురం: న్యూ ఇయర్ వేడుకలు కొద్ది గంటల్లో ప్రారంభమవుతుండటంతో నియోజకవర్గంలోని వీధుల్లో సందడి ప్రారంభమైంది. శనివారం రాత్రి 10 గంటల నుంచి మహిళలు, యువతులు ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగవల్లులతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు సిద్ధమయ్యారు. దీంతో వీధుల్లో సందడి నెలకొంది. అర్ధరాత్రి 12 గంటల వరకు ముగ్గులతో కాలక్షేపం చేసి అనంతరం కేక్‌లు కట్‌చేసి 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు మ్యూజిక్ ఏర్పాట్లతో సందడి చేశారు.

చర్చిల్లో ప్రార్థనలు..
మరో పక్క నియోజకవర్గం పరిధిలో అల్లిపురం సౌత్ జైలురోడ్డులో గల కల్వరి బాప్టిస్ట్ చర్చితో పాటు, సెయింట్ ఆంథోని చర్చి, జగదాంబ దరి ట్రినిటీ లూథరన్ చర్చి, లండన్ చర్చిలతో పాటు కొబ్బరితోటలో గల పలు ప్రార్థనా మందిరాల్లో క్రిస్టియన్లు ప్రార్థనలు చేసినట్లు కొబ్బరితోట ప్రార్థనా మందిరం పాస్టర్ మోజెస్ తెలిపారు.



అల్లిపురంలోని ఒక ఇంటి ముందు రంగవల్లి తీర్చిదిద్దుతున్న యువతి

క్యాలెండర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా గౌడ సంఘం రూపొందించిన 2023 క్యాలెండర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా ఆ సంఘ ప్రతినిధులు శనివారం ఆవిష్కరింపజేయించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గౌడ కులస్థులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ జెర్రిపోతుల ప్రసాద్, సంఘం నాయకులు కామన వెంకట సుబ్బారావు, మార్గాన రామారావు, యేకుల మధు, దాలయ్య, బత్తుల అప్పారావు, రేలంగి వెంకన్న, పరీదుల శ్రీనివాసరావు, మేరువ గణేష్, కొయ్య సత్యనారాయణ, నిచ్చనకోళ్ల వెంకట్రావు, మార్గాన చినబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..
డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కార్మిక సంఘం రూపొందించిన ఉద్యోగుల సెలవుల క్యాలెండర్‌ను కమిషనర్ రాజాబాబు చేతుల మీదుగా శనివారం ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరింపజేయించారు. కమిషనర్‌కు సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు, సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్లు సన్యాసిరావు, శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, వాటర్ సప్‌లై ఎస్ఈ రవిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి. ఆనంద్, బి. ఎర్రాజీ, జి. కుమార్, శ్రీను, రామకృష్ణ, కనకరాజు, శివ, కన్నబాబు, దీపక్, దుర్గావతి, సత్యం, మూర్తి, రాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అమూల్యం
మహారాణిపేట : పేద, బడుగు, బలహీన వర్గాలకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అమూల్యమని విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కొనియాడారు. శనివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సంస్థ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడ్డ తరగతుల సంక్షేమానికి కష్టపడి పని చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ మాట్లాడుతూ బీసీలను రాష్ట్రానికి బ్యాక్ బోన్‌గా భావించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో అందరూ ఏకపక్షంగా బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు యతిరాజుల నాగేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీనివాస్, బెందాళం పద్మావతి, పలువురు బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గౌడ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


డీసీఎంఎస్ విభాగాధిపతిగా ఆచార్య రవి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్(డీసీఎంఎస్) విభాగాధిపతిగా ఆచార్య జాలాది రవి నియమితులయ్యారు. శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఆయన ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా రవిని వీసీ అభినందించారు.

సమన్వయంతో పనిచేయాలి


- నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

అల్లిపురం : ప్రెస్, పోలీస్ సమన్వయంతో పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆకాంక్షించారు. నేరాల నియంత్రణలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. వారి సూచనలు సలహాలను పోలీస్ శాఖకు ఎప్పటికప్పుడు అందజేయాలని, తద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన కోరారు. విశాఖ క్రైం రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లో గల పోలీస్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం జరిగిన న్యూఇయర్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి జర్నలిస్టులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రైం రిపోర్టర్స్ అసోసియేషన్ జర్నలిస్టులకు స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ నాగన్న, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి రవికుమార్, ఎంఎస్ఆర్ ప్రసాద్‌తో పాటు క్రైం జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాత్రికేయులతో సీపీ సీహెచ్ శ్రీకాంత్ తదితరులు

నైతిక విలువలు ముఖ్యం



ఏయూ పాఠశాలలో మానవత ప్రతినిధులు

ఏయూక్యాంపస్: పాఠశాల విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండటం ఎంతో అవసరమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు అన్నారు. ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో శనివారం విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించడంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వేల మంది విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాల కోసం రూ.3,000 విరాళంగా మానవత సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాజశేఖర్, ఆచార్య పరమేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సలోమి తదితరులు పాల్గొన్నారు.